



WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

# విజయ కెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




ఆగస్టు 27 గురువారం 2026 | సంపుటి : 18 | సంచిక : 204 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సుద్ అహ్మద్

THURSDAY AUGUST 27 2026 | VOL:18 | ISSUE: 204 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed

## దొరకుంట రోడ్డు ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి



**సూర్యాపేట (విజయ కెరటం జర్నలిస్ట్ గౌస్)**

సూర్యాపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కోదాడ (మం) ద్వారకుంట దగ్గర కంటైనర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ఘటనపై మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ప్రభుత్వ సీఎస్‌ను ఆదేశించారు.

## ‘భారత్ ధర్మశాల కాదు’: 2047కు అమిత్ షా భారీ భద్రతా బ్లూప్రింట్

2047 అభివృద్ధి లక్ష్యానికి అంతర్గత భద్రత కీలకమని అమిత్ షా వ్యాఖ్య

అక్రమ చొరబాట్ల నుంచి దేశాన్ని విముక్తం చేయడమే లక్ష్యమని వెల్లడి

‘భారత్ ధర్మశాల కాదు’ అంటూ అక్రమ వలసదారులపై తీవ్ర వ్యాఖ్యలు

కొత్త క్రిమినల్ చట్టాల పూర్తి అమలుకు ఏడాది గడువు లక్ష్యం



(మిగతా 4వ పేజీలో..)

# తెలంగాణ సమీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

తెలంగాణ సమీక్షకు అధికారులకు కీలక ఆదేశాలు

పెండింగ్ అంశాలపై సమగ్రంగా సమీక్షించాలని సూచన

అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలి

అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ

**హైదరాబాద్,ఆగస్ట్26:**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్



2026-ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బుధవారం ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ



బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని సూచించారు. సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా

(మిగతా 2వ పేజీలో..)

## వరదలపై నేపాల్ ప్రధానితో మాట్లాడిన మోదీ.. అన్ని రకాల సాయం అందిస్తామని హామీ

నేపాల్‌లో ఆకస్మిక వరదలు భారీ నష్టాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. బుధవారం తలెత్తిన ఈ వరదల కారణంగా ఇప్పటివరకు 22 మంది మరణించగా, వందల మంది గల్లంతయ్యారు. వీరిలో 105 మంది వరకు భారతీయులున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ.. బుధవారం నేపాల్ ప్రధాని బాలెన్ షాతో మాట్లాడారు. ఈ మేరకు ఫోన్‌లో సంప్రదించారు.



(మిగతా 2వ పేజీలో..)

## కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమంగా సాగితే.. రేవంత్ పాలన భూముల వ్యాపారంగా సాగుతోంది: హరీశ్ రావు

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందన్న హరీశ్

పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను అమ్మేస్తున్నారని ఆరోపణ

లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొంటున్నారని మండిపాటు

నాడు కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమ కేంద్రంగా సాగితే, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలన భూముల వ్యాపారం కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్



(మిగతా 2వ పేజీలో..)

## ‘వందేమాతరం’పై కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కీలక ప్రకటన

రెండు చరణాలే పాడతామన్న సీఎం

కాంగ్రెస్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ప్రకటన

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆరు చరణాలు ఆలపించిన వైనం

అది తనకు తెలియకుండా జరిగిందన్న సీఎం డీకే


ప్రతి వర్గాన్ని గౌరవించడమే కాంగ్రెస్ సిద్ధాంతమని వ్యాఖ్య

కర్ణాటకలో ప్రభుత్వ కార్యక్రమాల్లో ‘వందేమాతరం’ పూర్తి గేయాన్ని ఆలపించబోమని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు.

(మిగతా 2వ పేజీలో..)



## నేపాల్‌లో వరద బీభత్సం.. 95 మంది మృతి



టిబెట్ నుంచి ఒక్కసారిగా దూసుకొచ్చిన వరద

403 మంది గల్లంతు.. 133 మంది భారతీయులు

కొట్టుకుపోయిన ఇళ్లు, రహదారులు, వంతెనలు

సహాయక చర్యల్లో నేపాల్, భారత్, చైనా బృందాలు

**కాఠ్మాండు, ఆగస్టు 26:**

నేపాల్‌లో భారీ వరద బీభత్సం సృష్టించింది. చైనా ఆక్రమిత టిబెట్ సరిహద్దులోని భోటెకోషి నదిలో బుధవారం ఉదయం ఒక్కసారిగా వచ్చిన వరదతో రసువా జిల్లాలోని పలు ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరద ప్రవాహం ఇళ్లు, రహదారులు, వంతెనలు, మార్కెట్లు, విద్యుత్ మౌలిక వసతులను కొట్టుకుపోయింది.

(మిగతా 2వ పేజీలో..)

## ఘోర రోడ్డు ప్రమాదంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దిగ్భ్రాంతి

**సూర్యాపేట టవిజయ కెరటం జర్నలిస్ట్ గౌస్)**

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కంటైనర్‌ను ఢీకొన్న ఘటనపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు మనోధైర్యం కలగాలని ప్రార్థిస్తున్నాం.



విజయకేరటం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# ఆర్థికపతనం దిశగా ..అమెరికా ఫస్ట్ నినాదం !

ఇరాన్‌తో జరిగిన యుద్ధం, అంతర్జాతీయంగా వివిధ దేశాలతో అనుసరిస్తున్న విధానా వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతోంది. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల సామాన్య పౌరులను చికాకు పెట్టిస్తోంది. ఇప్పటికే అక్కడ గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. నిత్యాసవర ధరలు కూడా పెరిగాయి. ఇరాన్‌తో యుద్ధం వల్ల అమెరికా ఓ రకంగా చతికిలపడిందనే చెప్పాలి. ఈ అనుభవం రష్యాకు కూడా వచ్చింది. ఉక్రెయిన్‌పై దాడులు రష్యానూ దెబ్బతీసాయి. యుద్ధాలతో విజయం దక్కకపోగా... ఆర్థిక రంగంలో వైఫల్యాలలు తీవ్రమవుతున్నాయి. దేశంలో సగటు పౌరులు ట్రంప్‌ను ఎన్నుకున్నందుకు బాధ పడుతున్నారు. ప్రపంచంతో సక్రమమైన సంబంధాలు కోల్పోవడంతో వారు అనేక రంగాల్లో ఇబ్బందులు పడుతున్నారు.వలసలపై ఆంక్షలు, ప్రపంచ దేశాలపై విచక్షణారహిత సుంకాల సమరం అమెరికాను అన్ని విధాల దెబ్బతీస్తున్నాయి. భౌగోళిక రాజకీయాలలోను, అంతర్జాతీయ ఆర్థిక రంగంలోనూ అభ్యుదయానికి కాకుండా అరాచకానికి ట్రంప్ కారకుడు అవుతున్నారు. భారత్ సహా వర్థమాన దేశాలన్నీ ఆర్థిక సంక్షోభం అంచుకు చేరుతున్నాయి. ఇవన్నీ ప్రత్యక్షంగా పరోక్షంగా అమెరికాను కూడా ముంచుతున్నాయి. అయినా ట్రంప్ ఇవేవీ గమనించడం లేదు. వచ్చే నవంబర్‌లో మధ్యంతర ఎన్నికలకు వెళ్లుతున్న అమెరికా ట్రంప్‌కు మద్దతుగా నిలుస్తుందా అనుమానాలు బయలుదేరాయి. లేక కొత్త ప్రస్థానాన్ని ప్రారంభిస్తుందా అని ప్రపంచమంతా ఎదురుచూస్తున్న విషయమిది. అమెరికాకు ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందన్నది వేరుగా చర్చించుకోవాల్సిన అవసరం లేదు. నిరంతర యుద్ధ వ్యయాలు, సంపన్న వర్గాలకు పెద్ద ఎత్తున పన్ను కోతలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాల మూలంగా తీవ్రమవుతున్న ఇంధన, సరఫరాల సంక్షోభాలు కూడా తోడయ్యాయి. అంతర్జాతీయ కరెన్సీగా డాలర్ ప్రాబల్యం తగ్గడం మొదలైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అంతర్జాతీయ వాణిజ్య విధానాలు పరిస్థితిని మరింతగా దిగజార్చి వేస్తున్నాయి. ఫలితంగా అమెరికా జాతీయ రుణం ఆ దేశ స్థూల దేశియోత్పత్తిలో **126** శాతంగా ఉన్నది. పోటీదారు అయిన చైనా జాతీయ రుణం జీడీపీలో **83** శాతంగా మాత్రమే ఉండగా జపాన్ జాతీయ రుణం జీడీపీలో ఇంచుమించు **250** శాతంగా ఉన్నది. అయితే జపాన్ ప్రభుత్వం తీసుకున్న రుణాలలో అత్యధికం దేశీయ బ్యాంకులు, మదుపుదారుల నుంచి తీసుకున్నవే. అమెరికా తనకు అవసరమైన నిధులను చాలా వరకు ఫెడరల్ రిజర్వ్ బాండ్లను విక్రయించడం ద్వారా సమకూర్చుకుంటున్నది. ఈ బాండ్ల కొనుగోలుదారు లలో అత్యధికులు విదేశీ సంస్థలు, మదుపుదారులే కావడం గమనార్హం. ఈ భారీ రుణంపై ఏటా **1** లక్ష కోట్ల డాలర్లకు పైగా వడ్డీ చెల్లిస్తున్నారు. అమెరికా ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేసినవారు నష్టాలు వాటిల్ల వచ్చనే భయంతో వాటిని విక్రయిస్తున్నారు. తక్కువ వడ్డీ రేట్లకు ఆ బాండ్లను మరిన్ని కొనడానికి నిరాకరి స్తున్నారు. ఈ పరిస్థితి కూడా అమెరికా రుణ సంక్షోభానికి దారితీసింది. దీని నుంచి బయట పడేందుకు తాను అమ్మిన బాండ్లను తానే కొనుగోలు చేసేందుకు అమెరికా సంసిద్ధమయినప్పటికీ పరిస్థితి మెరుగు పడడం లేదు. ఫెడరల్ ప్రభుత్వం తీసుకునే రుణం గరిష్ఠంగా **41.1** ట్రిలియన్ డాలర్లకు మించకూడదని గత ఏడాది అమెరికా కాంగ్రెస్ పరిమితి విధించింది. అయితే అంతకంతకూ పెరుగుతోన్న జాతీయ రుణ పరిమాణం ఆ గరిష్ఠ పరిమితిని **2027** ద్వితీయార్థంలో దాటుతుందని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఇదంతా కూడా వాణిజ్య విధానాల కారణంగానే అని చెప్పుకోవాలి. వివిధ దేశాలపై వాణిజ్య యుద్ధం ప్రకటించడంతో స్వేచ్ఛా వాణిజ్యం దెబ్బతింది. ప్రతిసెకనూ **90**వేల డాలర్ల మేరకు, దినసరిన **7.8** బిలియన్ డాలర్ల మేరకు జాతీయ రుణం పెరుగుతుందని

కాంగ్రెస్ జాయింట్ ఎకనామిక్ కమిటీ వెల్లడించింది. **2036** సంవత్సరం నాటికి ఈ రుణభారం **64** ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని కూడా ఆ కమిటీ పేర్కొంది ప్రతి అమెరిన్ పౌరుడిపై తలసరి రుణభారం **1,19,686** డాలర్లుగా లెక్క కట్టింది. అమెరికాకు ఈ రుణ దుస్థితి దాపురించడానికి డెమొక్రాటిక్, రిపబ్లికన్ ప్రభుత్వాలు రెండూ కారణమయినప్పటికీ డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు మరింత దిగజార్చా యని అమెరికన్‌లే గగ్గోలు పెడుతున్నారు. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేస్తానన్న ట్రంప్ నిజానికి అమెరికా పతనాన్ని మరింత వేగవంతం చేస్తున్నారని అనేకులు వాపోతున్నారు. అమెరికా ఫస్ట్ నినాదం ఇప్పుడు ఆర్థిక పనం దిశగా సాగుతోంది.

# వరదలపై నేపాల్ ప్రధానితో మాట్లాడిన మోదీ..

## అన్ని రకాల సాయం అందిస్తామని హామీ

మొదటి పేజీ తరువాయి)

నేపాల్‌లో సంభవించిన ఈ విషాద ఘటనపై ఆ దేశ ప్రధానికి, ప్రజలకు మోదీ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. ఇదే సమయంలో నేపాల్‌కు అవసరమైన మానవతా సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ అంశంపై ప్రధాని ఎక్స్ వేదికగా ప్రకటన చేశారు. నేపాల్ అధికారులతో భారతీయ బృందాలు సమన్వయం చేస్తున్నాయని ప్రధాని వెల్లడించారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానాల ద్వారా తగిన సాయం అందించేందుకు భారత్ ఏర్పాట్లు చేస్తోంది. అత్యవసర చికిత్సకు అవసరమయ్యే మందులు, రేషన్, ఇతర సరుకులు అందించాలని నిర్ణయించింది. ఇదే సమయంలో అక్కడ సహాయక చర్యలు కొనసాగిస్తున్న నేపాల్ అధికారులతో మన దేశానికి చెందిన నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్డీఆర్ఎఫ్) బృందాలు కూడా సహాయక చర్యల్లో పాల్గొనబోతున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఈ టీంలు సేవలు అందిస్తాయి. నేపాల్‌లో గల్లంతైన, చిక్కుకుపోయిన భారతీయులకు, వారి కుటుంబాలకు సాయం అందించేందుకు నేపాల్‌లోని భారతీయ రాయబార కార్యాలయం ప్రత్యేక ఎమర్జెన్సీ నెంబర్లను కేటాయించింది. 977 985 131 6807, o977 970 910 7500 నెంబర్లను వాట్సాప్ ద్వారా సంప్రదించాలని సూచించింది. బుధవారం నాటి ఘటనలో వందల మంది గల్లంతయ్యారు. ఇందులో 291 మంది విదేశీయులుండగా, 105 మంది భారతీయులు కూడా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# నేపాల్‌లో వరద బీభత్సం.. 95 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

రసువా జిల్లాలోని టిమురే, స్యాఫ్రుబేసి ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. వరద నీరు భోటెకోషి నుంచి త్రిశూలి నదిలోకి ప్రవహించడంతో దిగువ ప్రాంతాల్లోనూ అప్రమత్తత ప్రకటించారు.

95 మంది మృతి.. 403 మంది గల్లంతు

నేపాల్ పోలీసుల తాజా సమాచారం ప్రకారం ఇప్పటివరకు 95 మంది మృతదేహాలనువెలికితీశారు. మరో 403 మంది గల్లంతైనట్లు నమోదైంది. అయితే గల్లంతైన వారి జాబితా ప్రాథమికమైనదని, సహాయక చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో సంఖ్యల్లో మార్పులు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు.

133 మంది భారతీయులు

గల్లంతైన 403 మందిలో 341 మంది విదేశీయులు ఉన్నారు. వారిలో 133 మంది భారతీయులు ఉన్నట్లు తాజా సమాచారం. వీరిలో కొందరు కైలాస్--మానస సరోవర యాత్రకు వెళ్తున్నవారిగా అధికారులు గుర్తించారు. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాలకు చెందిన పర్యాటకులు కూడా గల్లంతైన వారి జాబితాలో ఉన్నారు.

ఒక్కసారిగా పెరిగిన నదీ ప్రవాహం

బుధవారం ఉదయం సుమారు 8.30 నుంచి 9 గంటల మధ్య భోటెకోషి నదిలో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగింది. టిబెట్ వైపు ల్హెండే నదీ పరివాహక ప్రాంతంలో భారీ మంచు--రాళ్ల కొండచరియ విరిగిపడటం వల్ల నీటి ప్రవాహం ఒక్కసారిగా ఉధృతమైనట్లు ప్రాథమిక అంచనాలు ఉన్నాయి. దీనికి ముందు సంభవించిన 4.4 తీవ్రత కలిగిన భూకంపం కూడా ఈ ఘటనకు కారణమై ఉండొచ్చని అధికారులు పరిశీలిస్తున్నారు. అయితే పూర్తి కారణాన్ని శాస్త్రీయంగా నిర్ధారించాల్సి ఉంది.

ధ్వంసమైన రహదారులు.. నిలిచిన రాకపోకలు

వరద ఉధృతికి అనేక రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడం సహాయక బృందాలకు కష్టంగా మారింది. విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు జలవిద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు.

ఐదు జిల్లాలకు హై అలర్ట్ వరద ప్రభావం మరింత దిగువ ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉండటంతో రసువా, నువాకోట్, ధాదింగ్, చిత్వన్, గోర్ఖా జిల్లాలను అప్రమత్తం చేశారు. భోటెకోషి, త్రిశూలి, నారాయణి నదుల పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు నదీ తీరాలకు వెళ్లవద్దని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు సూచించారు.ముమ్మరంగా సహాయక చర్యలునేపాల్ సైన్యం, సాయుధ పోలీసు, పోలీసు బలగాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. హెలికాప్టర్ల ద్వారా గాలింపు, తరలింపు చర్యలు చేపడుతున్నారు. అయితే భారీగా పేరుకుపోయిన బురద, తెగిపోయిన రహదారులు, ప్రతికూల వాతావరణం కారణంగా సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. భారత్, చైనా కూడా సహాయక చర్యలకు మద్దతు అందిస్తున్నాయి.

వైద్య సహాయం అందిస్తున్న డబ్ల్యూహెచ్ఓ

వరద బాధిత ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలకు సహకరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) మందులు, బహుళ ప్రయోజన టెంట్లు తదితర అత్యవసర సామగ్రిని పంపించింది. వ్యాధుల వ్యాప్తి నివారణ, ఆరోగ్య పరిస్థితుల పర్యవేక్షణకు కూడా చర్యలు చేపడుతున్నట్లు ఔనూ తెలిపింది.

# తెలంగాణ సమీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. డిసెంబర్ లో జరగనున్న సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడి దారులను ఆకర్షించాలని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే పక్రియను వేగవంతం చేయాలన్నారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహించాలని, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

## కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమంగా సాగితే.. రేవంత్ పాలన భూముల వ్యాపారంగా సాగుతోంది: హరీశ్ రావు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఈరోజు ఏర్పాటు చేసిన 22ఏ బాధితుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎక్కడ పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను విక్రయిస్తూ భావి తరాలకు కనీసం స్థలం కూడా లేకుండా చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. సామాన్య ప్రజల ఆస్తులనేమో 22ఏ నిషేధిత జాబితాలోకి నెడుతూ, ప్రభుత్వ భూములను మాత్రం ముఖ్యమంత్రి సోదరుల చేతుల్లోకి వెళ్లేలా చేస్తున్నారని విమర్శించారు. లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను పేదల వద్ద నుంచి లాక్కొని, కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఎప్పుడు 'హైడ్రా' వచ్చి ఇళ్లను కూలుస్తుందో, ఎప్పుడు 22ఏ పేరుతో తమ భూములను గుంజుకుంటారోనని ప్రజలు భయాందోళనలతో బతుకుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి ఎకరాలను, ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22ఏ జాబితాలో చేర్చిందని ఆరోపించారు. ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పుతూ... జాబితా నుంచి భూములను తొలగించడానికి 30 శాతం వరకు కమీషన్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ 22ఏ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా నిలదీస్తామని స్పష్టం చేశారు. బాధితులు ఎవరూ బ్రోకర్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని, ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పూర్తిగా తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

### 'వందేమాతరం'పై కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కీలక ప్రకటన

కాంగ్రెస్ నిర్ణయం మేరకు తొలి రెండు చరణాలు మాత్రమే పాడతామని తెలిపారు. ఈ విషయంలో పార్టీ వైఖరికి తాను కట్టుబడి ఉన్నానని చెప్పారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మొత్తం ఆరు చరణాలు ఆలపించడంపై ప్రశ్నించగా.. తనకు తెలియకుండానే ఆ నిర్ణయం జరిగి ఉండొచ్చని శివకుమార్ అన్నారు. ఇకపై ప్రభుత్వ కార్యక్రమాల్లో మాత్రం గతంలో నిర్ణయించిన విధంగానే తొలి రెండు చరణాలు మాత్రమే పాడతామని స్పష్టం చేశారు.కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఇటీవల 1937లో తీసుకున్న నిర్ణ యాన్ని మరోసారి సమర్థించింది. బహిరంగ, జాతీయ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలు మాత్రమే ఆలపించాలని అప్పట్లో నిర్ణయించినట్లు పేర్కొంది. మొత్తం చరణాలు పాడాలంటూ కొత్త వందేమాతరం బిల్లు రావడం నేపథ్యంలో ఈ అంశంపై కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతోంది.కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తప్పుబట్టింది. జాతీయ గేయాన్ని అవమా నిస్తున్నారని విమర్శించింది. ఓటు బ్యాంకు రాజకీయాలకు కాంగ్రెస్ పాల్పడుతోందని ఆరోపించింది.ఈ విమర్శలపై శివకుమార్ స్పందించారు. భారత్ భిన్న భాషలు, సంస్కృతులు, ప్రాంతాలతో కూడిన దేశమని అన్నారు. ప్రతి వర్గాన్ని గౌరవించడమే కాంగ్రెస్ సిద్ధాంతమని చెప్పారు. బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. వందేమాతరం తరువాతి చరణాల్లో దుర్గ, లక్ష్మి, సరస్వతి వంటి హిందూ దేవతల ప్రస్తావన ఉందని కాంగ్రెస్ చెబుతోంది. ఇతర వర్గాలకు అవి అభ్యంతరకరంగా ఉండొచ్చన్న కారణంతో తొలి రెండు చరణాలకే పరిమితం కావాలని నిర్ణయించింది. కర్ణాటకలోనూ ఇదే నిర్ణయం అమలవుతుందని శివకుమార్ స్పష్టం చేశారు.

# ఉపాధ్యాయులు జాతి నిర్మాతలు





తపస్ గురువందన కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి .

**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. ఆగస్టు 26 .విజయ కెరటం.**




నల్గొండ పట్టణంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించే గురువందన కార్యక్రమం జిల్లా అధ్యక్షులు బత్తిని భాస్కర్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గారు మాట్లాడుతూ సమాజంలో ప్రభుత్వ ప్రభుత్వం ఉపాధ్యాయ గౌరవాన్ని పెంచేలా చూడాలని దరఖాస్తుల ద్వారా ఉపాధ్యాయుల సన్మానించే విధానానికి స్వస్తి పలకాలని కోరారు. నాణ్యమైన విద్య ద్వారానే వికసిద్భారత్ కు పునాది అవుతుందని తరగతి గదిలలో జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుడు కీలక భూమిక పోషిస్తారని వారు అన్నారు.ప్రధాన వక్తగా విచ్చేసిన భాస్కర్ యోగి గారు మాట్లాడుతూ విలువలు బోధించాలి రామాయణ మహాభారతాలలో ఉన్నటువంటి అవునొచ్చని విద్యార్థులకు తెలియజేశారు చిన్నచిన్న కథల రూపంలో అవగాహన కల్పించాలని కోరారు.సమాజంలో నైతిక విలువల పతనం అయితే సమాజం విలువ తగ్గుతుంది.పాఠశాలలోనే సంస్కారాల నిర్మాణం జరగాలని ఆకాంక్షించారు.సమాజంలో ఉన్నత స్థాయి ఉద్యోగ పరీక్షలకు పోటీపడే పేద విద్యార్థులకు బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉచిత కోచింగ్ మరియు మెటీరియల్ అందజేయడం జరుగుతుందని,సమాజంలో అణగారిన వర్గాల పిల్లల చదువు కోసం ఇతోదిక సాయం చేయటానికి సిద్ధంగా ఉన్నానని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి హామీ ఇచ్చారు...తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తూ గురువు ఔనత్యాన్ని పెంచాలి. జిల్లా స్థాయి ఉపాధ్యాయులుగా ఎన్నికైనటువంటి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రేణికుంట్ల రాజశేఖర్,రాష్ట్ర బాధ్యులు పర్వతం సంధ్యారాణి, ఇరుగు శ్రీరాములు, కట్టెబోయిన శ్రీనివాస్, కొమిరెల్లి భాస్కర్ రెడ్డి, కంచనపల్లి విజయ్ కుమార్, వివిధ మండలాల మండల విద్యాధికారులు,గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వివిధ మండలాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు జిల్లా బాధ్యులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

**నల్లగొండ:**



మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల గురుకుల బాలికల కళాశాల నల్లగొండలోని లికాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ (COE)లిలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ జి.వి. రమేష్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.వి. రమేష్ మాట్లాడుతూ, “గురుకులాలు దేవాలయాల వంటివి” అని పేర్కొన్నారు. నల్లగొండలో తొలి కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసినందుకు వీజీా తెలంగాణ గురుకుల సంస్థల సెక్రటరీ శ్రీ సైదులుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని అత్యంత ప్రతిభావంతులైన అధ్యాపకులను ఈ కళాశాలలో నియమించి నాణ్యమైన విద్యను అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు ఇంజినీరింగ్, వైద్య విద్యతో పాటు ఇతర ప్రతిష్ఠాత్మక ఉన్నత విద్యా రంగాల్లో అత్యుత్తమ కళాశాలల్లో సీట్లు సాధించేందుకు ఈ కళాశాల ఒక సువర్ణ అవకాశాన్ని కల్పిస్తోందన్నారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని, వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో కూడిన కఠోర శ్రమ చేయాలని సూచించారు.జీవితంలో ఉన్నతంగా స్థిరపడిన అనంతరం తల్లిదండ్రులకు, సమాజానికి, తాము జన్మించిన గ్రామానికి ఉపయోగపడే విధంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులు ఈ దశలో అత్యంత క్రమశిక్షణతో మెలగాలని, మంచి గ్రంథాలను స్నేహితులుగా చేసుకోవాలని, సమాజంలో స్ఫూర్తిదాయకమైన వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు.తెలంగాణ ప్రభుత్వం గురుకుల విద్యాసంస్థల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అనేక రకాల సౌకర్యాలను అందిస్తోందని డాక్టర్ జి.వి. రమేష్ తెలిపారు. కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరిన విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేస్తూ, వారు తమ లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి భవాని మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్తుకు అత్యంత కీలకమైన దశ అని, ఉన్నత స్థాయికి ఎదగడానికి ఇది తొలిమెట్టని అన్నారు. విద్యార్థులు చదువుకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్న వీజీా సంస్థల సెక్రటరీ శ్రీ సైదులును ఆమె అభినందించారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తామని విద్యార్థులు తెలిపారు. తమకు నాణ్యమైన విద్యను అందిస్తూ, లక్ష్య సాధనకు మార్గనిర్దేశం చేస్తున్న ప్రిన్సిపాల్ భవాని మరియు అధ్యాపక బృందానికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొని ఫ్రెషర్స్ డే వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు.

## రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

**హంటర్ రోడ్డులో మద్యం మత్తులో కారు ఢీ.. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ కన్నుమూత**


**వరంగల్ మండల విజయ కెరటం ఆగష్టు 26 :**



హంటర్ రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ శ్రీనివాస్ చికిత్స పొందుతూ మృతి చెందారు.దేశాయిపేటకు చెందిన శ్రీనివాస్ 2012 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్‌గా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇంటెలిజెన్స్ విభాగంలో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి హంటర్ రోడ్డులో తన మిత్రుడిని కలిసేందుకు వేచి ఉండగా, మద్యం మత్తులో ఉన్న కారు డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయి శ్రీనివాస్‌ను బలంగా ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు.ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను తొలుత స్థానికంగా చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందారు.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కర్తవ్య నిర్వహణలో నిబద్ధతతో పనిచేసే శ్రీనివాస్ అకాల మరణంతో దేశాయిపేటలోని ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, వరంగల్ పోలీస్ కమిషనరేట్ వర్గాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## జర్నలిస్టులకు ఊరట.. పాత అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు!

- **సెప్టెంబర్ 15 వరకు కొనసాగింపు జర్నలిస్టుల ప్రయోజనాలకు హైకోర్టు తాత్కాలిక ఊరట**




**హైదరాబాద్ విజయ కెరటం ఆగష్టు 25:**

తెలంగాణలో జర్నలిస్టుల పాత అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని సెప్టెంబర్ 15 వరకు పొడిగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. జర్నలిస్టుల అక్రిడిటేషన్ నిబంధనలకు సంబంధించిన Jz--252, దాని సవరణ Jz--103లను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. వాదనలు విన్న అనంతరం జర్నలిస్టులకు ఊరట కల్పిస్తూ పాత అక్రిడిటేషన్ కార్డుల చెల్లుబాటును సెప్టెంబర్ 15 వరకు పొడిగిస్తూ తాత్కాలిక ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అక్రిడిటేషన్ కార్డులు కలిగిన జర్నలిస్టులకు తాత్కాలిక ఉపశమనం లభించినట్లైంది.

హైలెట్:


పాత అక్రిడిటేషన్ కార్డులు సెప్టెంబర్ 15 వరకు చెల్లుబాటు కానున్నాయి. అక్రిడిటేషన్ నిబంధనలపై హైకోర్టులో విచారణ కొనసాగుతోంది.

## గోల్డెన్ గ్లోబ్ అవార్డును పగలగొట్టి అబద్ధం చెప్పా: ఇయాన్ మెక్‌కెల్లెన్

దిగ్గజ నటుడు సర్ ఇయాన్ మెక్‌కెల్లెన్ తన కెరీర్‌లో అందుకున్న ఏకైక గోల్డెన్ గ్లోబ్ అవార్డుకు సంబంధించి తాను చెప్పిన ఒక అబద్ధాన్ని తాజాగా వెల్లడించారు. ప్రమాదవశాత్తు ఆ పురస్కారం మెమొంటో విరిగిపోవడంతో, అది కనిపించడం లేదని నిర్వాహకులకు అబద్ధం చెప్పినట్లు ఆయన అంగీకరించారు.1997లో “రస్పుటిన్: డార్క్ సర్వెంట్ ఆఫ్ డెస్టినీ” చిత్రంలో అద్భుత నటనకు గానూ మెక్‌కెల్లెన్ ఉత్తమ సహాయ నటుడిగా గోల్డెన్ గ్లోబ్ అవార్డును దక్కించుకున్నారు. త్వరలో ప్రసారం కానున్న ‘టీ విత్ జూడీ డెంచ్ ఫీచరింగ్ సర్ ఇయాన్ మెక్‌కెల్లెన్’ అనే ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ ఆసక్తికర సంఘటనను గుర్తుచేసుకున్నారు. దీనికి సంబంధించిన ఒక వీడియో క్లిప్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.“ఆ గోల్డెన్ గ్లోబ్ ప్రతిమను ఎలా తయారు చేశారో తెలుసుకోవాలనే కుతూహలంతో దాని కింద ఉన్న ఒక స్క్రూను విప్పాను. వెంటనే ఆ పురస్కారం ముక్కలైపోయింది. దాన్ని నేను తిరిగి అమర్చలేకపోయాను. అదే సమయంలో నా పేరును ఆ ప్రతిమపై చెక్కడం కోసం దానిని తిరిగి పంపాలని నిర్వాహకులు కోరారు. దాంతో అది కనిపించడం లేదని వారికి అబద్ధం చెప్పాల్సి వచ్చింది” అని మెక్‌కెల్లన్ వివరించారు. మెక్‌కెల్లెన్ తన సుదీర్ఘ కెరీర్‌లో అందుకున్న ఏకైక గోల్డెన్ గ్లోబ్ పురస్కారం ఇదే కావడం విశేషం. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మరో ప్రముఖ నటి డేమ్ జూడీ డెంచ్ కూడా తన ఆస్కార్ అవార్డుకు సంబంధించిన ఒక పొరపాటును పంచుకున్నారు. స్కై ఆర్ట్స్ ఛానల్‌లో ఈ కార్యక్రమం త్వరలో ప్రసారం కానుంది.

విజయకెరటం
తెలుగు దినపత్రిక

## 'భారత్ ధర్మశాల కాదు': 2047కు అమిత్ షా భారీ భద్రతా బ్లూప్రింట్



2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యానికి పటిష్ఠ అంతర్గత భద్రతే పునాది అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. చొరబాట్లు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, భవిష్యత్ భద్రతా సవాళ్లపై ఇప్పటి నుంచే ముందస్తు వ్యూహాలతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఇంటెలిజెన్స్ బ్యూరో 'జాతీయ భద్రతా సదస్సు' ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు.

ముప్పు రాకముందే చర్యలు

మరో 15 నుంచి 20 ఏళ్లలో ఎదురయ్యే భద్రతా సవాళ్లను ఇప్పటి నుంచే గుర్తించాలని అమిత్ షా సూచించారు. అవి పెద్ద సంక్షోభాలుగా మారకముందే తిప్పికొట్టే వ్యూహాలు సిద్ధం చేయాలని చెప్పారు. దేశంలో మూడు ప్రధాన అంతర్గత భద్రతా హాట్‌స్పాట్ల నుంచి ఎదురైన ముప్పులను సమర్థంగా అధిగమించామని పేర్కొన్నారు.

'ఇది ధర్మశాల కాదు'

సరిహద్దు భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టిందని షా తెలిపారు. ఎనిమిది నెలలుగా అన్ని భూ సరిహద్దు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపామని చెప్పారు. నాలుగు అంచెల సరిహద్దు భద్రతా ప్రణాళికను రాష్ట్రాలకు అందించామని వెల్లడించారు."ఇది ధర్మశాల కాదు. ఈ దేశ పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉంది" అని షా వ్యాఖ్యానించారు. అక్రమ చొరబాటుదారులు జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వం, జనాభా సమతుల్యతకు ముప్పని హెచ్చరించారు.

3 ఏళ్లలో కేసుల పరిష్కారమే లక్ష్యం

కొత్తగా తెచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను వచ్చే ఏడాదిలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు షా చెప్పారు. క్రిమినల్ కేసులు సుప్రీంకోర్టు స్థాయి వరకు మూడేళ్లలో పరిష్కారమయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. శిక్షల శాతాన్ని 25 శాతం పెంచడమూ లక్ష్యమేనన్నారు.

ఉగ్రవాదం, డ్రగ్స్‌పై ఉక్కుపాదం

పీఎఫ్ఐపై నిషేధం తర్వాత చేపట్టిన చర్యలను కేంద్ర-రాష్ట్ర సమన్వయానికి ఉదాహరణగా షా పేర్కొన్నారు. ఉగ్రవాద నెట్‌వర్క్‌లను పూర్తిగా ధ్వంసం చేసేందుకు 'ప్రహార్' వ్యూహాన్ని రోజువారీ భద్రతా కార్యకలాపాల్లో అమలు చేయాలని సూచించారు.మాదకద్రవ్యాలపై 'డిటెక్ట్, డిస్‌రప్ట్, డిస్ట్రాయ్' విధానాన్ని అనుసరించాలని రాష్ట్రాలకు పిలుపునిచ్చారు. 2026-29 మాదకద్రవ్య నియంత్రణ విజన్ డాక్యుమెంట్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు.

ఏఐతో కొత్త భద్రతా కవచం

సీసీటీఎన్ఎస్, ఐసీజేఎస్, నాట్‌గ్రిడ్, నాఫిస్ డేటాబేస్‌ల అనుసంధానంతో శక్తిమంతమైన నిఘా వ్యవస్థ ఏర్పడిందని షా తెలిపారు. కృత్రిమ మేధ, డేటా విశ్లేషణ, ప్రవర్తనా సరళి అధ్యయనం ద్వారా భవిష్యత్ ముప్పులను ముందే గుర్తించాలని యువ అధికారులకు సూచించారు.

## గర్భంతోనూ జిమ్‌లో సమంత.. ఫొటోలు వైరల్

గర్భధారణ సమయంలో తన ఫిట్‌నెస్ రొటీన్ ఎలా మారిందో నటి సమంత వెల్లడించింది. జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పంచుకుంది. ఇన్నాళ్లూ శరీరాన్ని మరింతగా శ్రమ పెట్టేలా శిక్షణ తీసుకున్నానని.. ఇప్పుడు శరీరం చెప్పేది వినడం నేర్చుకుంటున్నానని తెలిపింది.సమంత ఎన్నో ఏళ్లుగా శక్తిని పెంచే వ్యాయామాలు చేస్తున్నట్లు చెప్పింది. గర్భధారణ సమయంలోనూ వ్యాయామం కొనసాగించేందుకు వైద్యుడి అనుమతి తీసుకున్నానని తెలిపింది. తన ట్రైనర్‌కు గర్భధారణ సమయంలో వ్యాయామాలపై ప్రత్యేక శిక్షణ ఉందని వెల్లడించింది. తన శరీరం, గత అనుభవం, గర్భధారణ పరిస్థితికి తగ్గట్టుగా వర్కౌట్స్‌లో మార్పులు చేసినట్లు వివరించింది.ప్రతి ఒక్కరి గర్భధారణ ఒకేలా ఉండదని సమంత చెప్పింది. తన వర్కౌట్స్‌ను ఇతరులు అనుసరించొద్దని సూచించింది. వ్యాయామం చేసే ముందు వైద్యుడిని సంప్రదించాలని.. నిపుణులైన ట్రైనర్ సాయం తీసుకోవాలని కోరింది..తాను పంచుకున్న వీడియోలో ఛాతీకి సంబంధించిన వ్యాయామం చేసింది. అయితే గతంలోలా ఎక్కువ బరువు ఎత్తడంపై కాకుండా.. శరీరం ఇచ్చే సంకేతాలను గమనించడంపైనే ఇప్పుడు దృష్టి పెట్టినట్లు చెప్పింది. కొన్ని రోజులు వ్యాయామాన్ని తగ్గిస్తున్నానని తెలిపింది.కొన్ని రోజులైతే వర్కౌట్ మొత్తం నేలపై పడుకోవడంతోనే పూర్తవుతోందని సమంత సరదాగా వ్యాఖ్యానించింది. ఇన్నేళ్లుగా తన శరీరాన్ని మరింత పని చేయడానికి సిద్ధం చేశానని.. ఇప్పుడు తక్కువ పని చేయమని శరీరం అడిగినప్పుడు దాన్ని గౌరవించడం నేర్చుకుంటున్నానని పేర్కొంది.చిన్న ప్రాణాన్ని మోస్తున్న సమయంలో లక్ష్యాలు కూడా మారిపోతాయని సమంత అభిప్రాయపడింది. తన శరీరం ఇప్పటివరకు చేసిన పనుల్లో ఇదే అత్యంత బలమైన పని కావచ్చని పేర్కొంది. సమంత 2026 జూన్‌లో తన గర్భధారణ విషయాన్ని బహిరంగంగా వెల్లడించింది. భర్త రాజ్ నిడిమోరుతో కలిసి తొలి బిడ్డకు స్వాగతం పలకబోతున్నట్లు ప్రకటించింది.



# కృష్ణవేణి ఫౌండేషన్ సేవలు అభినందనీయం











**తిరుమలగిరి (విజయ కెరటం స్టేట్ బ్యూరో గౌస్)**

తిరుమల గిరి మెగా వైద్య శిబిరం విజయవంతం తిరుమలగిరి ఆగస్టు 26 విజయకేరటం ప్రతినిధి తిరుమలగిరిలోసింధు హాస్పిటల్ హైటెక్ సిటీ కృష్ణ వేణి ఫౌండేషన్ శంకరయ్య విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన హెల్త్ క్యాంప్ కు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని సింధు వైద్యశాల వైద్యుల బృందం తెలిపారు . కృష్ణవేణి ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ రక్షణ సేన తుంగతుర్తి నియోజక వర్గ ఇంచార్జి సూరారపు కృష్ణవేణి ఆధ్వర్యంలో సింధు హాస్పిటల్ హైటెక్ సిటీ వారి సహకారం తో,శంకరయ్య విజ్ఞాన కేంద్రం తో కలిసి జరిపిన హెల్త్ క్యాంప్ లో వైద్యుల బృందం క్యాన్సర్, కార్డియాక్, గైనిక్ తదితర సమస్యలతో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించమని 150 మంది కి పైగా ప్రజలు వైద్య పరీక్షల కు హాజరు కావడం జరిగిందని అన్నారు. వారందరికీ అన్ని పరీక్షలు పూర్తి చేసినమని ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే సింధు వైద్యశాల హైదరాబాద్ వారిని సంప్రదించాలని ఇంత మంచి అవకాశాన్ని పేద ప్రజలకు చేరువ చెయ్యడంలో కృష్ణవేణి ఫౌండేషన్ ముందు ఉండడం ఆనందానీయమని వారు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు కోటిరెడ్డి, హానిష, శ్రీ రామ్ మార్కెటింగ్ మేనేజర్ విజయ్, పోరెళ్ళ విప్లవ్ కుమార్, నాగులగాని హరీష్, వినయ్ ,సంపత్ , భాషామల్లా సైదులు భవాని, రజిత ముద్రబోయిన అనిల్ఉమ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్స్ యూనియన్ నేత విరాహత్ అలీని పరామర్శించిన పలువురు ప్రముఖులు





ఇటీవల మాతృ వియోగానికి గురైన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీని బుధవారం రోజు గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో పలువురు ప్రముఖులు కలిసి పరామర్శించారు. ఎమ్మెల్సీ కోదండరాం, తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.వి.శ్రీనివాస్, జనంసాక్షి పత్రిక సంపాదకులు ఎం.ఎం.రెహమాన్, ప్రజా గాయకులు ఏపూరి సోమన్న, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయు) జాతీయ కార్యవర్గ సభ్యురాలు, మీఫ్ట్యూ చీవషం ఛానెల్ ఎడిటర్ అజిత, టీయుడబ్ల్యూజే రాష్ట్ర నాయకురాలు, ప్రెస్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఉపాధ్యక్షురాలు అత్తలూరి అరుణ, టీయుడబ్ల్యూజే మహిళా విభాగం కన్వీనర్ కళ్యాణం రాజేశ్వరీ, హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీస్ జేఏసీ నాయకులు సూరజ్, గజ్వేల్ మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందన రవి, తెలంగాణ సర్జన్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ లింగం, టీయుడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు వెలిజాల చంద్రశేఖర్, వరంగల్ సీనియర్ పాత్రికేయులు కొండల్ రావు, రజినీకాంత్ లతో పాటు ఆయా జిల్లాలకు చెందిన జర్నలిస్టులు విరాహత్ అలీని పరామర్శించి ఓదార్చారు.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528